


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 29.11.2025 | సంపుటి : 2 | సంచిక :295 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 29.11.2025 | volume : 2 | Issue : 295 | Pages : 8 | Cost : 2/- |




### పంచాయితీ ఎన్నికలపై

## సిఎం ఫోకస్

### 1నుంచి రేవంత్ జిల్లాల పర్యటన

హైదరాబాద్, నవంబర్ 28 : పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో సిఎం మరోమారు జిల్లాల్లో పర్యటించి పార్టీ అభ్యర్థలను గెలిపించేందుకు

-మిగతా 2 లో..



06

### థర్డ్ వరల్డ్ దేశాల నుంచి శాశ్వతంగా వలసల నిలిపివేత


దేశ ప్రశాంతతకు భంగం కలిగించే వారిని బహిష్కరిస్తాం

బాంబు పేల్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### నయా భారత్ ఎవరికి

# తలవంచదు

### మన సుదర్శన చక్రం.. శత్రువులను నాశనం చేస్తుంది



#### ఉడుపితో అనుబంధం విడదీయరానిది

#### లక్ష కంఠ భగవద్గీత పఠనంలో ప్రధాని మోడీ

**అనంతరం భక్తులు, గాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. "గీతలో శ్రీకృష్ణుడి బోధనలు ప్రతి యుగానికి సంబంధించినవి. మన జాతీయ విధానాన్ని అవి నిర్దేశిస్తాయి. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్', 'సర్వజన్ హితయ' అనే నినాదాలు గీత నుంచి స్ఫూర్తి పొందినవే.**

బెంగళూరు, నవంబర్ 28 : మహిళల రక్షణపై శ్రీ కృష్ణుడి సందేశమే.. రిజర్వేషన్ల చట్టానికి మార్గనిర్దేశనం. శాంతి, సత్యాన్ని సాధించడం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే వారిని అణచివేయాలని గీత మనకు బోధిస్తుంది" అని మోదీ తెలిపారు. "గతంలో ఉగ్రదాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తుండిపోయాయి. కానీ, నయా భారత్ అలా కాదు. ఎవరి ముందు తలవంచదు. దేశ రక్షణ విషయంలో ఎన్నటికీ వెనకడుగు వేయదు. ఆపరేషన్ సిందూర్‌లో మన సంకల్పాన్ని

-మిగతా 2 లో..

### గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కంచు విగ్రహం

ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆవిష్కరణ

03



## ఈ దశలో స్టే ఎలా విధిస్తాం?

### పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

#### నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారు

#### పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

02

#### తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా

**పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది.**

### యంగ్ ఇండియా స్కూల్స్ కాదు

## పురుగుల్లేని అన్నం పెట్టండి

#### విద్యార్థులకు కల్తీ ఆహారంలో ఎంత మందిని జైలుకు పంపారు?

#### ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 28 : అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు అని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ముందు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యాశాఖపై ఇక నుంచి తానే సమీక్షలు చేస్తానని, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకే అన్న బెదిరింపులేమయ్యాయని ప్రశ్నించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని సీఎం

-మిగతా 2 లో..





## ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ?

#### మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు

#### పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 28 :దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతు న్నారు. వృద్ధులు, పిల్లల

-మిగతా 2 లో..

### సోనియా దయవల్లనే

## తెలంగాణ సాకారం

### కేసీఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

#### ఉనికి కోసం దీక్షా దివాస్ పేరుతో డ్రామాలు

#### ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి


#### బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు

#### మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 28 : తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ

-మిగతా 2 లో..





02

### అయ్యప్ప భక్తులకు

## శుభవార్త

#### ఇరుముడితో ప్రయాణానికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ అనుమతి

## కో.. అంటే కోట్లే

#### కోకాపేటలో ఎకరం రూ1.51 కోట్లకు అమ్మకం

#### నియోపోలీస్ ప్లాట్ల వేలంలో రికార్డుస్థాయి ధరలు

హైదరాబాద్, నవంబర్ 28 : భూమిలో బంగారం పండుతుందని అంటుంటారు. కానీ భూములు బంగారమ య్యాయని ఇప్పుడు నిరూపితం అయ్యింది. హైదరాబాద్ లో భూముల విలువ బంగారాన్ని మించి పెరిగిపోయి రికార్డు సృష్టిస్తున్నాయి. కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో

-మిగతా 2 లో..





#### నా తండ్రి సజీవంగా ఉన్నట్లు

### ఆధారాలు చూపండి

ఇమ్రాన్‌ఖాన్ కుమారుడు ఖాసీం ఖాన్



### శ్రీలంకలో వరదల బీభత్సం

56 మంది మృతి



### నైజీరియన్స్ చదువు మానేసి డ్రగ్స్ విక్రయిస్తున్నారు

#### తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

డ్రగ్స్ ముఠాలో 2వేలమ్మంది పెడ్లర్లు

50మంది నైజీరియన్ల అరెస్ట్‌తో కదులుతున్న డొంక

## నయా భారత్
# ఎవరికి తలవంచదు

(మొదటిపేజీ తరువాయి)



ప్రపంచం చూసింది. మన మిషన్ సుదర్శన చక్ర.. శత్రువులను నాశనం చేస్తుంది" అని మోదీ వెల్లడించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో దేశానికి సుదర్శన చక్ర భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గతంలో ప్రధాని తెలిపిన సంగతి తెలిసిందే. రాబోయే పదేళ్లలో దేశంలోని అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా పూర్తిస్థాయి సురక్షా కవచం ఏర్పాటు చేయడమే ఈ మిషన్ ఉద్దేశం. అంతకుముందు ఉడుపిలో మోదీ రోడ్ షో నిర్వహిం చారు. అనంతరం కృష్ణ ఆలయానికి చేరుకున్న ప్రధానికి పుతిగే మఠాధి పతి సుగుణేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అష్ట మఠాధిపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనకన కిండి (కిటికీ) నుంచి శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను మోదీ దర్శించుకున్నారు. అనంతరం లక్ష కంఠ భగవద్గీత పారాయణంలో ప్రధాని పాల్గొన్నారు. గీతలోని 10 శ్లోకాలను ఆయన అలవోకగా పఠించారు. ఈ సం దర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు. మోదీ అర్జునుడంటూ కొనియాడారు. ప్రధాని సేవలను ప్రశంసిస్తూ.. 'భారత భాగ్య విధాత' అనే బిరుదును ప్రదానం చేశారు.




# ఈ దశలో స్టే విధించలేం

(మొదటిపేజీ తరువాయి)

జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల ప‌క్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

## కేసీఆర్ దొంగదీక్షలతో
# తెలంగాణ రాలే

(మొదటిపేజీ తరువాయి)

రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

## మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు

### డిసెంబర్ 1నుంచి 6 వరకు రవీంద్రభారతిలో నిర్వహణ

**హైదరాబాద్, నవంబర్ 28 :** మహానటి సావిత్రి 90వ జయంతి సభలను నిర్వహించబోతున్నట్లు ఆమె కూతురు విజయ చాముండేశ్వరి ప్రకటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6 వరకు 'సావిత్రి మహోత్సవ్' పేరిట ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రముఖ కళా సంస్థ 'సంగమం' ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో సావిత్రి గారి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయి. డిసెంబర్ 6న జరిగే సావిత్రి 90వ జయంతి సభలో 'మహానటి' చిత్ర దర్శక నిర్మాతలైన నాగ్ అశ్విన్, ప్రియాంకా దత్, స్వప్నాదత్, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిషోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యని ప్రత్యేకంగా సత్కరించనున్నారు. మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సభకి భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నారు. చలన చిత్ర ప్రముఖులు ఆత్మీయ అతిథులుగా విచ్చేయనున్నారు.

# కో.. అంటే కోట్లే..

(మొదటిపేజీ తరువాయి)

కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 151 కోట్ల రూపాయలు పలికి హెచ్ఎండిఎకు కోట్లు కురిపించాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్లు ఆదాయం లభించింది. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఈ-వేలం శుక్రవారం ముగిసింది. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది.రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన ఊఓఆం .. 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ఎ÷-లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు ఊఓఆం అధికారులు తెలిపారు. అదే విధంగా ఎ÷-లాట్ నెంబర్ 16 లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే.. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ.



డిసెంబర్ 3, 5 తేదీల్లో మిగతా ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది హెచ్ఎండీఏ. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఅవుట్‌లో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దాదాపు 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. 40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్స్, 45 మీ. వెడల్పైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలను కల్పించారు. అలాగే కమర్షియల్, రెసిడెన్సీ, ఎంటర్‌టైన్‌మెంట్‌ల అవసరాలకు భవనాలు నిర్మించుకునేందుకు అనుమతించనున్నారు.

## నైజీరియన్స్ చదువు మానేసి
# డ్రగ్స్ విక్రయిస్తున్నారు

**హైదరాబాద్, నవంబర్ 28 :** డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సీబీ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాల్లో.. గడువు తీరిన 50 మందికిపైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించింది. వారిని ఈ టీమ్ అదుపులోకి తీసుకుంది. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాల్లో ఈ డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసింది. నాలుగు ప్రాంతాల్లో 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసింది. ఢిల్లీలోని 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించింది. ఇక నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలు ఈగల్ టీమ్ స్తంభింపజేసింది. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు 2 వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. ఢిల్లీ నుంచి డ్రగ్స్ పార్శిళ్లు.. బూట్లు, దుస్తులు, కాస్మోటిక్ వస్తువులు, చెప్పులు మధ్యలో డ్రగ్స్ పెట్టి కొరియర్ ద్వారా సప్లై చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. శ్రీ మారుతి కొరియర్స్, డీటీడీసీ, ప్రొఫెషనల్ కొరియర్స్, షిప్ రాకెట్, ఇండియా పోస్ట్, ఢిల్లీ వేరీ, బ్లూ డార్ట్, ట్రాక్ ఆన్ తదితర కొరియర్స్ నెట్‌వర్క్‌ను ఈ నైజీరియన్ ముఠా



ఉపయోగించినట్లు ఈ కేసు విచారణలో బహిర్గతమైంది. రికొద్ది రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ డ్రగ్స్ ఆపరేషన్‌ను ఛేదించింది. ఢిల్లీలో అరెస్ట్ చేసిన 50 మందిని హైదరాబాద్‌కు తరలించేందుకు ఈ టీమ్ ఇప్పటికే చర్యలు చేపట్టింది. వీరిని హైదరాబాద్‌కు తరలించిన తర్వాత కోర్టులో హాజరుపరచనుంది. అనంతరం వీరిని మరింత లోతుగా విచారణ జరపనుందని తెలుస్తోంది. ఈ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఈగల్ టీమ్ భావిస్తోంది. ఈ విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉందని సమాచారం.

## అయ్యప్ప భక్తులకు శుభవార్త

**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** అయ్యప్ప స్వామి భక్తులకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శుభవార్త తెలిపింది. శబరిమలకు వెళ్లే మాలధారులు విమానాల్లో 'ఇరుముడి' తో ప్రయాణించొచ్చని తాజాగా వెల్లడించింది. విమానంలో కొబ్బరికాయలను స్వాములు తమ వెంట తీసుకెళ్లొచ్చని చెప్పింది. అయ్యప్ప స్వాముల నుంచి వచ్చిన వినతుల మేరకు, వారి సౌకర్యార్థం నిబంధనలను సడలించామని ఏఏఐ పేర్కొంది. ఈ నిబంధన అక్టోబర్ 28 శుక్రవారం నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఈ నిబంధనల సడలింపు అనేది వచ్చే ఏడాది జనవరి 20 వరకు అమలులో ఉంటుందని తెలిపింది. అయ్యప్ప స్వాముల ప్రయాణం సాఫీగా, సేఫ్‌గా జరగడానికి కొబ్బరికాయలను క్యాబిన్?లోకి తీసుకెళ్లే ముందు ఎక్స్ రే, ఎక్స్‌లోజివ్ ట్రేస్ డిటెక్షన్ (ఈటీడీ), భౌతిక తనిఖీలు ఉంటాయని పేర్కొంది.

## సమస్యలు పరిష్కరించని కాంగ్రెస్

- నగరంలో అధ్వాన్న రోడ్లను పట్టించుకోరా
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

**హైదరాబాద్, నవంబర్ 28 :** కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఏదైనా చిన్న సమస్యను కూడా పరిష్కరించలేదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ఉప్పల్ హైదరాబాద్ రోడ్డును రెండేళ్లయినా బాగు చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం లో ఉండగా జాతీయ రహదారిని బాగు చేయాలన్న ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. గత రెండేళ్లుగా ఎందుకు దీనిపై అశ్రద్ధగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. నగరంలో అనేక రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎంతసేపు ఎలక్షన్లు కలెక్షన్లు అన్న రీతిలో పాలన సాగుతోందని ప్రభాకర్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల పేరుతో ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న భూములను అప్పనంగా కొట్టేసే ప్రయత్నం సాగుతోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాలకు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ హెచ్చరించారు. భూముల కోసమే జీహెచ్ఎంసీ పరిధి విస్తరించినట్లుగా ఉందని అన్నారు. వసతుల కల్పన లేకుండా పరిధి విస్తరిస్తే ఏం లాభమని అన్నారు.





## మెట్రో ప్రయాణికులకు
# గుడ్ న్యూస్

### స్టేషన్లలో వస్తువుల స్టోర్‌కు స్మార్ట్ లాకర్లు

**హైదరాబాద్, నవంబర్ 28 :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్ చెప్పింది. ప్రయాణంలో భాగంగా మోసుకెళ్లాల్సిన అవసరం లేదు అనుకునే సమాన్లను మెట్రో స్టేషన్లలోనే స్టోర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది . అన్ని మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా ముందుగా ఏడు స్టేషన్లలో స్మార్ట్ లాకర్లను శుక్రవారం ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలోని ఏడు మెట్రో స్టేషన్లలో ఆన్-డిమాండ్ స్మార్ట్ స్టోరేజ్ లాకర్ల సౌకర్యంను ప్రారంభించింది. హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికులకు సౌకర్యం పెంచటంతో పాటుగా యుటిలిటీ ఆధారిత సేవలను విస్తరించడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణిస్తున్నారు. హెల్మెట్లు, సామాను, షాపింగ్ బ్యాగులు, బ్యాక్‌ప్యాక్‌లు సహా ఇతర వ్యక్తిగత వస్తువులను సురక్షితంగా భద్రపరచడం దీని ఉద్దేశం. దీంతో ప్రయాణికులు ఎలాంటి ప్రయాస లేకుండా ప్రశాంతంగా ప్రయాణించే అవకాశం కలుగుతుంది. స్మార్ట్ లాకర్స్ ప్రారంభ కార్యక్రమం ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో జరిగింది. టక్కీట్ స్మార్ట్ లాకర్లు సౌకర్యవంతమైన స్టోరేజ్ అనుభవాన్ని అందిస్తాయి. ప్రయాణికులు మూడు విధాలుగా కేవలం 30 సెకన్లలోపు స్మార్ట్ లాకింగ్ చేయవచ్చు. తొలుత స్మార్ట్ లాకర్ల సేవలు 7 స్టేషన్లలో లభ్యమవుతున్నాయి. అవి: మియాపూర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎల్ బి నగర్, ఉప్పల్, పరేడ్ గ్రౌండ్, హై-టెక్ సిటీ.

## పంచాయతీ ఎన్నికలపై సిఎం ఫోకస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. మొత్తం ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. ఆరు రోజులు ఆరు జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించనున్నారు. సీఎం రేవంత్ పర్యటన షెడ్యూల్ ఇలావుంటి. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, 2న ఖమ్మం జిల్లా కొత్తగూడెం, 3న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, 4న ఆదిలాబాద్, 5న నర్సంపేట, 6న నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటించనున్నారు. తెలంగాణలో త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. మొదటి విడత వచ్చే నెల డిసెంబర్ 11, రెండో విడత డిసెంబర్ 14, మూడో విడత డిసెంబర్ 17న ఉంటుంది. అయితే, ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన చేపట్టనున్నారని తెలుస్తోంది. తాజాగా, సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది.

## ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ?

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఢిల్లీ కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనని కోరారు. నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకటే చెప్పారు. బిడ్డలు విషపూరిత గాలిని పీల్చుకుంటున్నారని. నీరసించి పోవడమే కాకండా భయపడు తున్నారని చెప్పారు. ఆందోళనగా ఉంటున్నారని వాపోయారు. మోడీ జీ.. భారతదేశ పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరెలా మౌనంగా ఉండగల్గుతున్నారు? మీ ప్రభుత్వానికి ఎందుకు అత్యవసర ప్రణాళిక లేదు. జవాబుదారీతనం లేదా? అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి దేశానికి ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు. మన పిల్లలు స్వచ్ఛమైన గాలికి అర్హులు- సాకులు, పరధ్యానాలు కాదని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చర్చ జరపాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. డిసెంబర్ 1 నుంచే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం అవుతున్నాయి. నవంబర్ 30న ఆల్ పార్టీ మీటింగ్ జరగనుంది.

## పిల్లలకు పురుగులు లేని
# అన్నం పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి 'పురుగులన్నం మాకు వద్దు' అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కంచు విగ్రహం

## ప్రధాని మోడీ చేతుల మీదుగా ఆవిష్కరణ




**గోవా, నవంబర్ 28 :** దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్తగాలి జీవోత్తం మఠంలో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కంచు విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధాత్మిత అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. మఠం 550వ వార్షికోత్సవంపై ఆర్గనైజేషన్ కమిటీ జాయింట్ కన్వీనర్ ఎస్ ముకుంద్ కామత్ మాట్లాడుతూ, 15,000 మంది ఈ ఈవెంట్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. శంకర్ మహదేవన్, అనూప్ జలోటా తదితర ప్రముఖ కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్తగాలి జీవోత్తం మఠం తొలి సారస్వత బ్రాహ్మిణ్ వైష్ణవ మఠమని పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ గోవాలోని పార్తగాలిలో మఠం ప్రధాన కార్యాలయం ఉంది. 13వ శతాబ్దంలో జగద్గురు మధ్వాచార్యులు స్థాపించిన ద్వైత సిద్ధాంతాన్ని ఈ మఠం అనుసరిస్తుందని పేర్కొంది.



# విన్‌జు గేమింగ్ యాప్ ప్రమోటర్ల అరెస్టు..

## రూ.505 కోట్ల ఆస్తులు జప్తు

**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన చర్యలను కఠినతరం చేసింది. అందులోభాగంగా విన్‌జు యాప్ ప్రమోటర్లు పవన్ సింగ్ నందా, సౌమ్య రాథోడ్‌లను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. వారికి సంబంధించిన కోట్లు విలువచేసే ఆస్తులను కూడా జప్తు చేశారు. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగానే వీరిని అదుపులోకి తీసుకున్నామని ఈడీ తెలిపింది. ఆన్‌లైన్ రియల్- మనీ గేమింగ్ కార్యకలాపాలకు సంబంధించి ఈ కంపెనీపై పలు ఆరోపణలు వచ్చినట్లు వెల్లడించింది. వినియోగదారుల ఖాతాలను బ్లాక్ చేయడం, వారి పాన్‌కార్డు వివరాలను దుర్వినియోగం చేయడం వంటి ఆరోపణలపై విన్‌జు గేమ్స్‌తో సహా మరికొందరిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తుంది. తమ కేవైసీ సమాచారాన్ని చట్టవిరుద్ధంగా ఉపయోగించడంతో పాటు మరికొన్ని ప్లాట్‌ఫామ్‌లకు వీటిని అనుసంధా నించడంతో తాము ఆర్థికంగా నష్టపోయామని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఈ క్రమంలో గతవారం బెంగళూరు జోనల్ కార్యాలయంతో పాటు దిల్లీ, గురుగ్రామ్‌లలోని నాలుగు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. విన్‌జు గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన సుమారు రూ.505 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపింది. ఈ కంపెనీ భారత్‌లోనే కాకుండా బ్రెజిల్, అమెరికా, జర్మనీ దేశాల్లో కూడా గేమింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పేర్కొంది. ఇక, రియల్ మనీ గేమ్‌లపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. నాటినుంచి ఈ విన్‌జు గేమింగ్ యాప్ ఆటగాళ్లకు చెందిన దాదాపు రూ.43 కోట్లను తిరిగి చెల్లించకుండా తన వద్దే ఉంచుకుందని అధికారులు చెప్పారు. అల్గారిథమ్‌తో కస్టమర్లను పక్కదోవ పట్టిస్తున్నట్లు గుర్తించారు.



# చిరంజీవి ట్రస్ట్‌కు విదేశీ విరాళాలు

## కేంద్రం అనుమతి లభ్యం

**హైదరాబాద్, నవంబర్ 28 :** మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు మరో అవకాశం చిక్కింది. చెప్పనవసరం లేదు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వేలాది మందికి ఆయన సహాయం అందించారు. అయితే ఆయన సేవాగుణం నుంచే ఉద్భవించినదే 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్'. దాదాపు 27 ఏళ్లుగా ఈ సంస్థ ద్వారా బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ సేవలతో ఎంతో మంది రక్తం, నేత్రాలు పొంది పునర్జీవనం పొందుతున్నారు. కరోనా సమయంలో కూడా ఈ ట్రస్ట్ విశేష సేవలను అందించింది. తాజాగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ ఒక శుభవార్తను ప్రకటించింది. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఎఫ్‌సీఆర్‌ఏ కింద నమోదు చేసుకునేందుకు కేంద్ర హోంశాఖ అవకాశం కల్పించింది. దీనిద్వారా ఈ ట్రస్ట్ ఇకపై విదేశాల నుంచి కూడా విరాళాలు తీసుకునే వెసులుబాటును పొందింది. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం 2010 ప్రకారం ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతి తప్పనిసరి చేయడంతో, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ చేసుకున్న అప్పీల్‌కు ప్రస్తుతం అనుమతి లభించింది.

# బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం

- 42శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం
- కామారెడ్డి డిక్లరేషన్ తుంగలో తొక్కిన అధికార పార్టీ
- బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శ



**హనుమకొండ, నవంబర్ 28 :** బీసీలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఓట్ల కోసం ఆ పార్టీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లపై వెనక్కి తగ్గినందుకు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. తమకు అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు కత్తులు నూరుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పూర్తి వ్యతిరేకత ఉందని.. ఇక, భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు గెలిచే అవకాశమే లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి జరగాలంటే భాజపాతోనే సాధ్యం. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సరిగా చేయలేదు. కుల ధ్రువీకరణ పత్రం కోసం సర్వర్లు పని చేయక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. బీసీ రిజర్వేషన్లపై డ్రామాలాడింది. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఈటల తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులకు గుర్తులు ఉండవని.. గెలిచిన వారిని కాంగ్రెస్ నుంచి గెలిచారని చెప్పుకుందామని భావిస్తున్నారేమో అంటూ సందేహం వ్యక్తం చేశారు. కానీ కాంగ్రెస్ చేసిన మోసానికి బీసీలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని...హామీ ఇచ్చేటప్పుడు తెలియదా? అంటూ అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. బీసీల జనాభా ఎంతో తేల్చకుండా రిజర్వేషన్లు ఎలా చేస్తారంటూ కాంగ్రెస్ సర్కారును ఆయన సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నాడు బీఆర్ఎస్ భూములు లాక్కున్నట్టే నేడు కాంగ్రెస్ పార్టీ లాక్కుట్టుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూ కుంభకోణాల కు హద్దు లేదు.. దీనికి మూల్యం చెల్లించక తప్పదంటూ ఎంపీ ఈటల హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోనే అధిక భూములు లాక్కుంటున్నారంటూ సోదాహరణగా వివరించారు. భూముల కోసమే జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరించినట్లు అయితే.. దాని కంటే దరిద్రం ఇంకోటి లేదని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# కేసీఆర్ దీక్ష చేసినప్పుడు మీరంతా ఏమయ్యారు

## విమర్శకులకు మాజీ మంత్రి తలసాని విసుర్లు



**హైదరాబాద్, నవంబర్ 28 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద అవాకులు చవాకులు పేలినంత మాత్రాన ఆయన చరిత్ర మారదని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ స్పష్టం చేశారు. 2009 నవంబర్ 29వ తేదీన నాటి టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్ష ఒక చరిత్ర అని ఆయన అభివర్ణించారు. ఈ దీక్షపై పలువురు సోయి లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొత్త బిచ్చగాళ్లు పొద్దు ఎరగరు అన్నట్లుగా కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కడిది?.. తెలంగాణ ప్రభుత్వం ఎక్కడి దంటూ ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలను తలసాని శ్రీనివాసయాదవ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బతుకమ్మ పేరుతో ఆనాడు తమ ప్రభుత్వం చీరలు పంచితే.. ప్రస్తుతం ఇందిరమ్మ చీరలంటూ పేరు మార్చారని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ చీరలు పంపిణీకి కేసీఆర్ తన పేరు పెట్టుకోలేదని గుర్తు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ దీక్షా దివాస్‌ను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి తలసారి స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్ర తెలియని వాళ్ళు మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళు.. తెలంగాణ ఏర్పాటు చేసే సమయంలో ఎక్కడున్నారంటూ? ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్టాన్ని సాధించకుంటే.. ఇప్పుడు మాట్లాడుతున్న వాళ్ళకి పదవి ఎక్కడిదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఈ సందర్భంగా ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. తెలంగాణ రాష్టాన్ని సోనియా గాంధీ ఇచ్చారని నిండు అసెంబ్లీలోనే కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వాళ్ళ లాగా మూర్ఖుల్లా తాము మాట్లాడమని తలసాని శ్రీనివాసయాదవ్ స్పష్టం చేశారు.

# విదేశాల్లో ఆస్తులను లెక్కచూపని వారి జాబితాను రెడీ చేసిన ఐటి శాఖ

## త్వరలోనే నోటీసులు ఇచ్చేందుకు రెడీ

**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** విదేశాల్లో ఆస్తులను కలిగివున్న వారు అలాంటి వాటి వివరాలను ఐటీ రిటర్నుల్లో వెల్లడించని వారిపై ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. 2025-26 ఏడాదికి గాను వ్యక్తిగతంగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసిన వారిలో తమకు విదేశాల్లోవున్న ఆస్తులను వెల్లడించని వారిని గుర్తించినట్టు వెల్లడించింది. ఇందుకు సంబంధించి 25 వేల మందికి ఈ-మెయిల్ లేదా ఎస్ఎంఎస్ రూపంలో హెచ్చరికలు పంపనున్నట్లు తెలిపింది. విదేశాల్లోని ఆస్తులను ఐటీ రిటర్నుల్లో వెల్లడించని వారికి ఈ నెల 28 నుంచి ఎస్ఎంస్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వనున్నట్టు ఐటీ శాఖ ప్రకటించింది. ఈ జాబితాలో ఉన్నవారు తమ ఐటీఆర్‌ని సవరించి డిసెంబర్ 31లోగా తిరిగి సమర్పించాల్సి వుంటుందని సూచించింది. అప్పటిలోగా చేయకపోతే చట్ట పరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వుంటుందని హెచ్చరించింది. ఇందుకోసం ఐటీ శాఖ పెద్ద సంస్థలను కూడా సంప్రదించి వారి ఉద్యోగుల జాబితాను సేకరించింది. గత ఆర్థిక సంవత్సరం 2024-25 లో 24, 678 మంది తమ ఐటీ రిటర్నులను సవరించి తిరిగి దాఖలు చేశారు. వీరి విదేశీ ఆస్తులు రూ. 29,208 కోట్లుగా ఉన్నాయి. కాగా, తుది గడువు లోపు విదేశీ ఆస్తులను ప్రకటించని వారు నల్లధన నిరోధక చట్టం ప్రకారం, రూ. 10 లక్షల జరిమానా, 30 శాతం పన్ను, చెల్లించాల్సిన పన్నులో 300 శాతం వరకు అదనపు జరిమానాను ఎదుర్కోవాల్సి రావచ్చు.

# ఏసీబీకి చిక్కిన తహసిల్దార్

**మహబూబాబాద్, నవంబర్ 28 :** భూ భారతి రికార్డుల్లో పేరును నమోదు చేయడానికి లంచం తీసుకుంటూ తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం పోచంపల్లి గ్రామ శివారులోని పడమటి తండా గ్రామపంచాయతీకి చెందిన భూక్యా బాలు అనే రైతు తన తండ్రి మరణించారు. భూక్యా స్వామి మృతి చెందడంతో తండ్రిపేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద భూ భారతి రికార్డుల్లో నమోదు చేయించుకోవడానికి తహసీల్దార్ వీరగంటి మహేందర్‌ను కలిశాడు. రూ.25వేల లంచంను డిమాండ్ చేశారు. దీంతో చేసేది లేక బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం 15 వేల రూపాయలు ఇస్తూ శుక్రవారం ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.



# జనవరి 1న ఆయుధాలు విడిచి లొంగిపోతాం

## మావోయిస్టులు

**భద్రాచలం:** మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఎంఎంసీ (మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.



# రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయి

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 28 :** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వచ్చే ఏడాదిలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం కేంద్రమంత్రి పరిశీలించారు. హైదరాబాద్‌లోని అన్ని రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. హైటెక్ సిటీతో పోటీపడే విధంగా అక్కడి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.35 కోట్లతో రెండు విడతలుగా పనులు జరుతున్నాయని, వచ్చే ఫిబ్రవరిలోపు తొలి విడత పూర్తవుతాయన్నారు. సంక్రాంతి సందర్భంగా 16 ప్రత్యేక రైళ్లు ఇక్కడ ఆపుతామని పేర్కొన్నారు.

# అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, నవంబర్ 28 :** రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేందప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రిం చాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించా రు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# మున్సిపాలిటీల విలీనానికి బిజెపి వ్యతిరేకం : రామ్‌చందర్‌రావు



**హైదరాబాద్, నవంబర్ 28 :** జీహెచ్‌ఎంసీలో పలు మున్సిపాలిటీలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వెల్లడించారు. మున్సిపాలిటీ విలీనం అశాస్త్రీయంగా ఉందన్నారు. మజ్లిస్ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే మున్సిపాలిటీలను విలీనం చేస్తున్నా రని ఆరోపించారు. విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నా రు. ఏ ప్రాతిపదికన విలీనం చేస్తున్నారో చెప్పాలన్నారు. శివారు మున్సిపాలిటీల తీరు అధ్వాన్నంగా ఉందని, ఇప్పుడు మరింత అధ్వాన్నంగా మారగలదని అన్నారు.



# రెండో రోజు సర్పంచి పదవులకు 4,901 నామినేషన్లు

**హైదరాబాద్, నవంబర్ 28 :** తెలంగాణలో మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం.. సర్పంచి పదవులకు 4901 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజులకు కలిపి సర్పంచి స్థానాల కోసం 8,198 నామినేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. నిన్న, ఇవాళ కలిపి వార్డు సభ్యులకు 11,502 నామినేషన్లు అందినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 4,236 సర్పంచి, 37,440 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు రేపటితో గడువు ముగియనుంది.

# పత్తి రైతులపై నిబంధనల కత్తి!



**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి.అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది.**

రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు.

ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేంద్రప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. దీంతో రిజిస్ట్రేషన్ నుంచి అమ్మకం దాకా సమస్యలు వెన్నాడాయి. యాప్ కనెక్ట్ కాకపోతే ప్రైవే టు వ్యాపారులే గతి అనే పరిస్థితి నెలకొన్నది. ఈలోగా వానలు, వరదలు ముంచెత్తడంతో పత్తిబేళ్లు తడిసి అసలుకే ఎసరు వస్తున్నది.

ఇంకోవైపు ఎకరాకు సగటున 13 క్వింటాళ్లు కొంటామన్న సీసీఐ చివరి నిమిషంలో చెప్పాపెట్టకుండా ఎకరాకు 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతుల నెత్తిన పిడుగుపడింది. తేమ శాతం ఎక్కువగా ఉందనో, రంగు మారిందనో ఇష్టారాజ్యంగా ధర చెల్లిస్తున్నారు. ఇప్పుడు 12 శాతం ఉంటేనే నాసిరకం అంటూ ధర తగ్గిస్తున్నారు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండింఏ రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

# కామారెడ్డిలో కవిత రైలు రోకో

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- కాళేశ్వరంతో నిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్



**కామారెడ్డి, నవంబర్ 28 :** కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకు నే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారం కామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనం తరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసు లు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారు-ణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజక వర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# దుబాయ్ తేజస్ ఘటన దురదృష్టకరం

- యథావిధిగా భవిష్యత్ ప్రణాళికలు
- హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్ వెల్లడి

**బెంగళూరు, నవంబర్ 28 :** దుబాయ్ ఎయిర్ షో చివరి రోజున భారత యుద్ధ విమానం తేజస్ కూలిపోవడాన్ని దురదృష్టకర సంఘటనగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ అభివర్ణించారు. ఈ సంఘటన తేజస్ కార్యక్రమం భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టం చేశారు. తాజాగా నిర్వహించిన జాతీయ భద్రతా సదస్సులో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేజస్ యుద్ధ విమానంలో ఎటువంటి లోపాలు లేవని ఆయన వెల్లడించారు.జాతీయ భద్రతా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తేజస్‌లో ఎటువంటి సమస్యలు లేవు. ఈ వేదిక నుంచి, ఇది అద్భుతమైన యుద్ధ విమానం అని నేను ప్రకటిస్తున్నాను. ఇది పూర్తిగా సురక్షితమైనది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా రికార్డును కలిగి ఉందని ఆయన వెల్లడించారు. దుబాయ్‌లో తేజస్ విమానం కూలిపోవడం దురదృష్టకరమని, ఈ ప్రమాదం తేజస్ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానం విదేశీ గడ్డపై కూలిపోవడం ఇదే తొలిసారి. అయితే ఈ÷టైర్ జెట్ ఇప్పటి వరకు రెండుసార్లు మాత్రమే కూలిపోయింది.ఒక దేశం ముందుకు సాగుతూ.. దాని సొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ పయోగించినప్పుడు, అది అనేక దశలను దాటవలసి ఉంటుందని ఆయన అన్నారు. నేడు మేము ఈ 4.5-తరం విమానాన్ని కొత్త సామర్థ్యాలతో అభివృద్ధి చేసామని, ఇది భారీ విజయం అని వెల్లడించారు. ప్రస్తుతం మా దగ్గర 180 తేజస్ విమానాలు ఉ న్నాయి, భవిష్యత్తులో ఈ సంఖ్య పెరుగుతుంది.
ఈ విమానానికి ప్రపంచ వ్యాప్తంగా రక్షణ రంగంలో పెద్ద ఎగుమతి మార్కెట్ కూడా ఉంటుందని ఆయన అన్నారు. భవిష్యత్తు ఆర్డర్ల గురించి ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కంబాట్ ఏరియల్ వెహికల్ త్వరలో పూర్తవుతుందని అన్నారు. ఇవి 2026 నాటికి సిద్ధంగా ఉంటాయని, 2027 నాటికి ఆకాశంలో ఎగురుతాయని వెల్లడించారు.

# పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి

## మంత్రులతో సిఎం చంద్రబాబు

**అమరావతి, నవంబర్ 28 :** పోలవరం వద్ద ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పోలవరం పూర్తికి వేగంగా పనులు సాగుతున్నాయని అన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత.. వివిధ అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. 2027 మే నాటికి పోలవరం పూర్తి చేయాలనేది లక్ష్యమని, గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని రైతులు సంతృప్తికరంగా ఉన్నారని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, పాడేరు వైద్య కళాశాలలు త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

# పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ

- మధ్యంతర బెయిల్‌ను రద్దు చేస్తూ.. లొంగిపోవాలని ఆదేశం
- రెండు వారాల్లో లొంగిపోవాలని వార్నింగ్

**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** పల్నాడు జంట హత్యల కేసులో వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారు దాఖలు చేసిన రెండు పిటిషన్లను కొట్టివేసింది. అంతేకాకుండా మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ఆదేశాలు జారీ చేశారు. హత్య కేసులో పిన్నెల్లి సోదరులకు ముందస్తు బెయిల్‌కు అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే సరెండర్ కావడానికి కొంత సమయం కావాలని పిన్నెల్లి తరపు లాయర్లు కోర్టును కోరారు. దీంతో సరెండర్ అయ్యేందుకు రెండు వారాల సమయాన్ని న్యాయస్థానం ఇచ్చింది. పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు చెప్పినా... సహకరించలేదని, సాక్షులను బెదిరించారని, సాక్ష్యాలు ట్యాంపర్ చేసే ప్రయత్నం చేశారని రాష్ట్ర ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఇద్దరిని చంపిన వ్యవహారంలో ముందస్తు బెయిల్ పొందేందుకు పిన్నెల్లి సోదరులకు ఏమాత్రం అర్హత లేదని జస్టిస్ సందీప్ మెహతా వ్యాఖ్యానించారు. వెంటనే అరెస్టు చేయడానికి ఎలాంటి అనుమతులు అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే లొంగిపోవడానికి రెండు వారాలు సమయం ఇవ్వాలని పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు కోరారు. ముందస్తు బెయిల్ విషయంలో లొంగిపోయేందుకు సమయం ఎలా ఇస్తారని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయని ప్రభుత్వాన్ని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. నిందితుల 161 స్టేట్‌మెంట్‌ను పోలీసులు నిందితులకే ఎలా ఇస్తారని జస్టిస్ నిలదీశారు. పోలీసులు కూడా నిందితులకు పూర్తిగా సహకరిస్తున్నట్లు ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కూడా పూర్తిస్థాయి దర్యాప్తు అవసరం అవుతుందేమోనని కూడా జస్టిస్ సందీప్ మెహతా అన్నారు. 161 స్టేట్‌మెంట్ కూడా తమకు అనుకూలంగా ఉందని, పోలీసుల విచారణలో పూర్తిగా సహకరిస్తున్నారని సుప్రీంకు పిన్నెల్లి సోదరుల తరపు న్యాయవాదులు తెలిపారు.



# పేదల కోసం అర్ధరాత్రి వరకూ కోర్టులో ఉంటా : సీజేఐ

**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. పేద కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడటం తన తొలి ప్రాధాన్యమన్న ఆయన.. అవసరమైతే, వారి కోసం అర్ధరాత్రి వరకూ న్యాయస్థానంలో కూర్చుంటానని అన్నారు. తిలక్ సింగ్ డాంగి అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వంతోపాటు ఇతరులపై దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా సీజేఐ ఈ విధంగా స్పందించారు. తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవని, ఇటువంటి కేసులను సంపన్నులు వేస్తున్నారని ఈ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. హరియాణా హిసార్ జిల్లాలోని మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ సూర్యకాంత్.. భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 24న బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. దాదాపు 15 నెలలపాటు ఈ పదవిలో ఉండనున్నారు. 2027 ఫిబ్రవరి 9న సీజేఐ పదవీ విరమణ చేస్తారు.

# తాగి వచ్చి భర్త వేధింపులు

## తట్టుకోలేక హత్య చేసిన భార్య

**హైదరాబాద్, నవంబర్ 28 :** రోజూ మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను వదిలించుకునేందుకు అతడిని భార్య అంతమొందించింది. కుమారుడు, మరొకరితో కలిసి మెడకు టవల్ బిగించి హత్య చేసింది. ఈ ఘటన మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ దేవేందర్‌నగర్‌కు చెందిన బండారు అంజయ్య (55) ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్. అతనికి భార్య ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిత్యం మద్యం తాగివచ్చి భార్య, పిల్లలను వేధింపులకు గురి చేస్తున్నాడు. గురువారం రాత్రి భార్య బుగమ్మ, కుమారుడు రాజు, బంధువు శేఖర్‌తో కలిసి అంజయ్య మద్యం తాగారు. అర్ధరాత్రి భార్య, కుమారుడు, బంధువు కలిసి అంజయ్య మెడకు టవల్ బిగించి ఊపిరాడకుండా చేసి చంపేశారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన అంజయ్య కుమార్తెను గదిలో బంధించారు. జరిగిన విషయం కుమార్తె చెప్పడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమించిన యువతికి మరో యువకుడితో వివాహం

## ఆత్మహత్య చేసుకున్న ప్రేమికుడు

**నిజామాబాద్, నవంబర్ 28 :** ప్రేమించి మోసపోయానని గ్రహించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. నిజామాబాద్ జిల్లా దొంచందకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి.. ఏరుగట్లకు చెందిన ఓ యువతితో ఆరేళ్లుగా ప్రేమలో పడ్డారు. ఇరువురు ఎంతో అన్యోన్యంగా ఉంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాంత్‌రెడ్డి తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకునేందుకు లండన్ నుంచి నిజామాబాద్ వచ్చారు. అయితే.. సదరు యువతి తల్లిదం డ్రులు ఆమెకు మరో యువకుడితో పెళ్లి జరిపించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శ్రీకాం త్‌రెడ్డి మృతిచెందారు. ఈ ఘటనతో శ్రీకాంత్ కుటుంబం.. నిజామాబాద్ పట్టణంలో మృతదేహంతో ఆందోళనకు దిగింది. ఇంతలో పోలీసులు వీరి ఆందోళనను అడ్డుకు న్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, పోలీసు లకు మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి మృతిపై నిజామాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టాలని అతడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

# జోగుగూడెంలో సర్పంచ్ పదవికి వేలం

- 20లక్షలకు దక్కించుకున్న వ్యక్తి
- ఆంజనేయ ఆలయానికి వినియోగిస్తామని వెల్లడి

**ఖమ్మం, నవంబర్ 28 :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచ్ పదవి దక్కించుకోవడం కోసం పలువురు నేతలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పలుచోట్ల వేలం పాటలు సాగుతున్నాయి. గ్రామపంచాయితీ అభివృద్ధి కోసం అంటూ గ్రామ పెద్దలు ధరలు నిర్ణయిస్తు న్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల ఆ పదవిని బహిరంగ వేలం వేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి బహిరంగ వేలం వేశారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. వారిలో అత్యధికంగా ఒకరు రూ.20లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. గ్రామంలో అభయాం జనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి వేలంలో వచ్చిన నగదు ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. పూర్తిగా గిరిజన గ్రామమైన జోగుగూడెంలో 1350 మంది జనాభా ఉండగా. 800 మంది ఓటర్లు ఉన్నారు. రెండో దశలో ఈగ్రామంలో పోలింగ్ జరగనుంది. ఈనెల 30 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సర్పంచి పదవికి వేలం పాట అనంతరం గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు.

# ఎస్ఐ గన్ మిస్ కేసు

## కొనసాగుతున్న విచారణ

**హైదరాబాద్, నవంబర్ 28 :** అంబర్‌పేట్ ఎస్ఐ గన్ మిస్సింగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్ఐ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమం లో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది. రోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.



## అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

**కామారెడ్డి కలెక్టరేట్, రాజముద్ర న్యూస్ :** భూ భారతి, రెవెన్యూ భూభారతి సదస్సుల పెండింగ్ దరఖాస్తులు విద్యార్థులకు అందించే సర్టిఫికెట్స్ లపై శుక్రవారం సాయంత్రం ఆర్డీఓ తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన పెండింగ్ దరఖాస్తుల పై మండలాల వారీగా రెవెన్యూ అధికారులతో క్షేత్ర స్థాయిలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత మాడ్యూల్ లో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ , నోటీసులు జారీచేసిన వివరాలు అలాగే క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమగ్రంగా అప్లోడ్ ల పై ఆరా తీశారు.

### ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శ

కాలకునుగుణంగా సాదాబైనామా దరఖాస్తులను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో స్పష్టమైన, వివరణాత్మక కారణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.దరఖాస్తులు అందిన వెంటనే అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వెంటనే మంజూరీ జాబితాలను పంపాలని నిర్దేశించారు. ఆధార్ కోసం అవసరమైన విద్యార్థులకు జనన ధృవీకరణ పత్రాలను అత్యంత త్వరితగతిన జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మోకిల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా చిట్టెంపల్లి శేఖర్

### ఏకగ్రీవ తీర్మానం చేసిన మోకిల కాంగ్రెస్ గ్రామ పార్టీ

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మోకిలా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం శుక్రవారం రోజు విజయవంతంగా నిర్వహించబడింది. మోకిల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌండ్ర సత్యం నేతృత్వంలో చిట్టెంపల్లి శేఖర్‌ను పార్టీ తరఫున ఏకగ్రీవంగా సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు హాజరయ్యారు. శేఖర్ ప్రజాసేవా అనుభవం, నాయకత్వ సామర్థ్యం, గ్రామ అభివృద్ధిపై చూపిన ఆసక్తి అన్ని వర్గాల నుంచి ప్రశంసలను అందుకుంది. పార్టీ వక్తలు, కార్యకర్తలు కులమతాలకు మించిన ఐక్యతను నిలుపుకుని, గ్రామం సమగ్రంగా అభివృద్ధి చెందాలని, శేఖర్ నేతృత్వంలో పౌర సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో శేఖర్ భవిష్యత్తులో చేపట్టబోయే పాఠశాలల అభివృద్ధి, రోడ్లు, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, యువతకు అవకాశాలు, మహిళల సంక్షేమం వంటి అంశాల పై కూడా చర్చ జరిగింది. కార్యకర్తల ఉత్సాహం, ప్రజల సానుకూల స్పందనతో శేఖర్ అభ్యర్థిత్వానికి అనుకూల వాతావరణం స్పష్టంగా ఏర్పడినట్లు కనిపించింది.



## లంచం ఇవ్వలేదని కక్షతో ఇంటిని కూల్చివేశారు

### ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి భూదేవి హిల్స్ లో కుత్బుల్లాపూర్ ఆర్ఐ మామీద కక్ష కట్టి అక్రమంగా తాము కట్టుకొని ఉంటున్న ఇంటిని జెసిబి తో కూల్చివేశాడంటూ సీనియర్ విలేఖరి ఓదేలు ఆందోళన వ్యక్తం చేసారు. 2018లో 21 లక్షల రూపాయలతో స్థానికంగా లేఅవుట్ చేసి విక్రయిస్తున్న బాలకృష్ణ అనే వ్యక్తి వద్ద తాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత ఎనిమిది నెలల నుండి ఈ ప్రాంతంలో రెండు గదులు నిర్మించుకొని ఈ మధ్యనే గృహప్రవేశం చేసి ఉంటుండగా గురువారం తాము బయటకు వెళ్లిన సమయంలో అక్రమంగా కూల్చివేశారు. మధ్యవర్తి ద్వారా ఆర్ఐ గతంలో 2 లక్షల రూపాయలు అడిగాడు అంటూ ఆరోపించాడు. మాకు ప్లాట్ అమ్మిన బాలకృష్ణను సంప్రదిస్తే ఇది ప్రభుత్వ భూమి కాదు మీరు ఆర్ ఐ పై కేసు పెట్టాలంటూ సలహా ఇచ్చాడు కానీ మేము ఎవరిని సంప్రదించాలో అర్థం కాని పరిస్థితిలో మీడియాను వేడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## గిరిజన బాలికలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి

### బాలల హక్కుల కమిషన్ మెంబర్ గోగుల సరిత

- పీర్జాదిగూడ నగర పరిధిలోని మేడిపల్లి గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబెర్ గోగుల సరిత



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యులు గోగుల సరిత, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి,



మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రవీందర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థినులతో మాట్లాడుతూ... వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, భద్రతా, మౌలిక సదుపాయాల లభ్యత వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై అవగాహన కలిగి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ మజహర్, బి. నాగరాజు, మహిళా నాయకురాలు శ్రీలత భద్రు నాయక్, నాయకులు వెంకటేష్ యాదవ్, సుమిత్ పాల్ రెడ్డి, సుధాకర్, సందీప్ నేత, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు గుర్రాల కోసం వేట

- పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాన పార్టీల వ్యూహ రచన
- పొత్తుల్లో కీలకం కానున్న కామ్రేడ్‌లు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పంచాయతీ ఎన్నికల్లో అధికారక ప్రకటన రావడం, ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఓట్ల పండుగ మొదలైంది.పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం మండలాల్లో పంచాయతీ ఎన్నికలు రెండో విడతలో జరుగనున్నాయి.దీంతో ప్రధాన పార్టీలు గ్రామ స్థాయిలో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ మొదలుపెట్టాయి.సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో బలపరిచే పార్టీతో పాటుగా, అభ్యర్థి గుణగణాలు,స్థానికంగా ప్రజలతో కలిగిన ఉన్న సత్సంబంధాలు, వ్యవహార శైలి గెలుపోటముల పై ప్రభావం చూపుతాయి.దీంతో ఆర్థికంగా బలమైన, వివాద రహిత అభ్యర్థుల కోసం పార్టీలు వేట కొనసాగిస్తున్నాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ పంచాయతీ ఎన్నికల్లో గెలిచి,మెజార్టీ పంచాయతీ పీఠాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉండగా, ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి.బిజెపి సైతం గుర్తింపు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయగా, కామ్రేడ్(కమ్యూనిస్ట్)లు కీలకంగా మారనున్నారు.పంచాయతీ ఎన్నికల్లో పోటీచేస్తామని తెలుగుదేశం నాయకులు ఇప్పటికే ప్రకటించారు.

### ఓట్ల కోసం అభ్యర్థుల పాట్లు..!

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు పంచాయతీ రిజర్వేషన్లు ప్రకటించడం, ఎన్నికల నగారా మోగడమే ఆలస్యం పోటీచేసే అభ్యర్థులు గ్రామాల్లో ఓటర్లను మచ్చిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.గ్రామంలోని వీధులన్నీ తిరుగుతూ చిన్న,పెద్దా తేడా లేకుండా ఓటర్లను కలిసి,పోటీలో నిలబడుతున్నా.. సహకరించాలంటూ అభ్యర్థిస్తూ ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు.గ్రామంలోని పాత గొడవలను మరచిపోయి, గిట్టని వారితో మాట కలుపుతూ ఓట్ల కోసం నానా తిప్పలు పడుతున్నారు.సర్పంచ్ పదవి కోసం కక్ష్యలను,పగను పట్టించుకోకుండా ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ఓటే ముఖ్యమంటూ పడరాని పాట్లు పడుతున్నారు.

### ఏకగ్రీవం కోసం అధికార పార్టీ ప్రయత్నాలు..!

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకగ్రీవం కోసం అధికార పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.దీనికి తోడు గ్రామాల్లో ప్రజలంతా చర్చించుకుని పంచాయతీలను ఏకగ్రీవం చేస్తే 10 లక్షల రూపాయల గ్రాంట్ ఇస్తామని ఇటీవల వ్యవసాయ,చేనేత,జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించడంతో ఏకగ్రీవాలకి ప్రాధాన్యత సంతరించుకుంది.పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాలతో కలిపి 134 గ్రామ పంచాయతీల్లో,1222 వార్డులకి రెండో విడతలో ఎన్నికలు జరుగనున్నాయి.నామినేషన్ ల ప్రక్రియ మొదలైతే ఆశావహ అభ్యర్థుల పంచాయతి ఓ కొలిక్కి వస్తుంది.

## మంత్రి పొంగులేటి ఆదేశిస్తే పాతర్లపాడు సర్పంచ్‌గా పోటీ చేస్తా

- మాజీ సర్పంచ్ రామసహాయం వెంకట్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ గెలుపు నల్లేరు పై నడకే



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీదే విజయమని, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశిస్తే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచి తీరుతానని తిరుమలాయపాలెం మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన రామసహయం వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతల కాలం నుండి తమది కాంగ్రెస్ కుటుంబమని,తన తాత తమిరె వెంకట్ రెడ్డి పాతర్లపాడు గ్రామానికి సుధీర్ఘంగా 25 సంవత్సరాలు సర్పంచ్ గా పనిచేసి,గ్రామానికి సేవలు అందించారని చెప్పారు.అదే విధంగా 2006 పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తను పోటీ చేసి బంపర్ మెజార్టీతో గెలుపొంది పాతర్లపాడు గ్రామాన్ని అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేశానని తెలిపారు. మరోసారి 2019లో జనరల్ రిజర్వేషన్ కావడంతో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేసి, ఒకే పార్టీ నుండి ఇద్దరు వద్దనుకుని,బీసీ బిడ్డ కోసం సీటు త్యాగం చేసి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నానని గుర్తు చేశారు. ఇతర పార్టీల నాయకులు భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురి చేసిన పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్నానని అన్నారు.సిఎం రేవంత్ రెడ్డి నేతృ త్వంలోని ప్రజా ప్రభుత్వం జనరంజక పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఈ నెల 14 న జరుగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా అవ కాశం ఇస్తే,తుంబూరు దయాకర్ రెడ్డి ఆశీస్సులతో, మండ లంలోని సీనియర్ నాయకుల సహకారంతో విజయం సాధిం చి మంత్రి పొంగులేటికి బహుమతిగా ఇస్తానని స్పష్టం చేశారు.

## రైతులు వరి కొయ్యలను తగలబెట్టవద్దు

- వ్యవసాయాధికారిణి రామడుగు వాణి
- తహసిల్దార్ రవికుమార్‌తో కలిసి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు,నేల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి తెలిపారు.తహసిల్దార్ రవికుమార్ తో కలసి శుక్రవారం కొత్తూరు గ్రామంలో వరి కొయ్యలని తగలబెడుతున్న రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టన్ను వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా 60 కిలోలు కార్బన్ మోనాక్సైడ్, 14వందల కిలోల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో కలిసిపోయి వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని తెలియజేశారు.అదే విధంగా భూమిలో ఉన్న ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడమే కాక,భూమిలోని తేమశాతం కూడా తగ్గుతుందని వెల్లడించారు.కావున రైతులందరూ వరి పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగి,భూమికి అవసరమైన పోషకాలు అందుతాయని చెప్పారు.సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా డీకంపోజర్ల వంటివి ఉపయోగించి భూమిలో కలియదున్నాలని సూచించారు.అనంతరం వారు కొత్తూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాలేరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక, రైతులు,తదితరులు పాల్గొన్నారు.



## తోటకూర వజ్రేష్ యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ

- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను సన్మానించిన నాయకులు
- పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ నగరాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని నూతనంగా నియమితులైన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పీర్జాదిగూడ నగర మాజీ కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తోటకూర వజ్రేష్ యాదవ్‌కు ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. వారు అనునిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పీర్జాదిగూడ నగరాభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు.పీర్జాదిగూడ, బోడుప్పల్ నగరపాలక సంస్థలకు అత్యధికంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని అన్నారు. తోటకూర వజ్రేష్ యాదవ్ రాబోయే రోజుల్లో రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వజ్రేష్ యాదవ్ ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్, కొంపల్లి వెంకటేష్ గౌడ్, బద్దం అంజిరెడ్డి, గున్నాల అశోక్ రెడ్డి, పీసర్ల సత్తిరెడ్డి, బద్దం జంగారెడ్డి, గట్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తుకు భూభారతిలో మోక్షం

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో పాసుబుక్ మంజూరు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఓ ఎన్నారై 2022లో ధరణిలో చేసుకున్న దరఖాస్తు కు భూభారతిలో మోక్షం లభించింది. జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆదేశాలతో ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్ మూడు రోజుల్లో ఎన్నారై కు పాస్ బుక్ మంజూరు చేశారు. వివరాల్లోకి వెళితే ఏదులాపురం మున్సి పాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన పసుపులేటి రాజ గోపాల్ అమెరికాలో స్థిరపడ్డాడు. ఇతనికి ఎదులాపురం రెవిన్యూలోని సర్వే నెంబర్ 19లో కుంట,సర్వేనెంబర్20 లో 31 కుంటలు,327 సర్వే నెంబర్ లో 20 కుంటలు భూమి ఉంది.దీనికోసం తన ఎన్నారై పోర్టల్ నుంచి 2022లో దరఖాస్తు చేసుకున్నాడు. కానీ దీనిపై అప్పటి అధికారులు స్పందన లేకపోవడంతో అది అలాగే తహసిల్దార్ లాగిన్ లో ఉండిపోయింది. ఈ నేపథ్యంలో సదరు ఎన్నారై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వాట్సాప్ ద్వారా తన పరిస్థితిని విన్నవించారు.తక్షణమే స్పందించిన కలెక్టర్ అనుదీప్ రాంప్రసాద్ కు సమాచారం అందించారు. దీనిని తన లాగిన్ లో పరిశీలించిన తహసిల్దార్ అప్లికేషన్లో ఉన్న సమస్యలను సదరు ఎన్నారై తో చర్చించారు. అలాగే ఇక్కడి వారి కుటుంబ సభ్యుడైన వెంపటి సురేందర్ ద్వారా పత్రాలను తెప్పించుకొని, పూర్తిస్థాయిలో పరిశీలన చేసి పాసుబుక్కును జారీ చేశారు. ఆ భూమికి సంబంధించిన పత్రాలను శుక్రవారం తన కార్యాలయంలో సురేందర్ కు అందజేశారు. కాగా పాస్ బుక్ జారీకావడంతో ఎన్ఆర్ఐ పసుపులేటి రాజగోపాల్ తన వాట్సప్ వేదికగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,తహసిల్దార్ రాంప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపాడు. సుమారు మూడు సంవత్సరాల పైబడి ఉన్న సమస్య పరిష్కారం కావడం పట్ల హర్షం వ్యక్తపరిచాడు.



## కొత్త కొత్తూరు సిపిఐ గ్రామ కార్యదర్శి కాంగ్రెస్ పార్టీలో చేరిక

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన దయాకర్ రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ జనరంజక పాలనతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు.నేలకొండపల్లి మండలంలోని కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మాలోత్ అయోధ్య రామయ్య,సిపిఐ కౌన్సిల్ సభ్యులు వల్లాల కృష్ణ,రాంసింగ్ ఠాగూర్ శుక్రవారం నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి దయాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లాగాని వెంకటరామారావు,రావేళ్ళ జ్యోతిబస్,మాలోత్ హనుమా,జాల కృష్ణ,పార్టీ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.



## కందాళ సమక్షంలో బిఆర్ఎస్, సిపిఎం పొత్తు ఖరారు

### కాంగ్రెస్ పార్టీకి ధీటుగా 21 పంచాయతీల్లో పోటీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు పరస్పర సహకారంతో పొత్తులు కుదుర్చుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం లోని మారెమ్మగుడి సమీపంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్ లో శుక్రవారం పాలేరు నియోజ కవర్గ మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ ఇంచార్జి కందాళ ఉపేందర్ రెడ్డి సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆధ్వర్యంలో ఇరు పార్టీల నాయకులతో చర్చలు జరిపారు.రూరల్ మండలంలోని మొత్తం 21 గ్రామ పంచాయ తీల్లో బిఆర్ఎస్,సిపిఎం పార్టీలు పొత్తులో భాగంగా కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు.ప్రతి గ్రామంలో ఉమ్మడి ఇరు పార్టీల కార్యకర్తలు వివాదాలకు తావు లేకుండా ఎన్నికల్లో ముందుకెళ్లాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారుఅధికార కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కొని మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని సిపిఎం,బిఆర్ఎస్ కార్యకర్తలను సమావేశంలో కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు,మాజీ జెడ్పీటీసీ వర ప్రసాద్,సిపిఎం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## థాయ్‌లాండ్‌లో వరదలు

### 145 మంది మృతి

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. దక్షిణ థాయ్‌లాండ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకు 145 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఈ వరదలకు 12 లక్షలకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని.. అనేక మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రహదారుల వంటి మౌలిక సౌకర్యాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.





## శ్రీలంకలో వరదల బీభత్సం

### 56 మంది మృతి

**శ్రీలంక :** శ్రీలంకలోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దిత్వా తుపాను కారణంగా ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడడంతో 56 మంది మరణించినట్లు ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో 21 మంది గల్లంతయినట్లు తెలిపారు. వరద ధాటికి 600కి పైగా ఇళ్లు, పాఠశాలలు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక రహదారులు, పొలాలు జల దిగ్బంధమయ్యాయి. వరదల్లో గల్లంతైన వారికోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు ఆపరేషన్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దేశంలోని అనేక నగరాలు వరదలో చిక్కుకుపోవడంతో శ్రీలంక ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూసివేసింది. రైలు సర్వీసులు నిలిపివేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలు, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. దేశంలోని మరిన్ని ప్రాంతాలకు భారీ వర్ష ముప్పు ఉన్నట్లు స్థానిక వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది. శ్రీలంకలో సంభవించిన వరదల్లో దాదాపు 56మంది ప్రాణాలు కోల్పోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. కష్ట సమయంలో పొరుగు దేశానికి స్నేహ హస్తం అందించేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో అత్యవసర మానవతా సాయం పంపినట్లు ప్రకటించారు.

## నా తండ్రి సజీవంగా ఉన్నట్లు ఆధారాలు చూపండి

### ఇమ్రాన్ ఖాన్ కుమారుడు ఖాసీం ఖాన్



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తలను ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్ కుమారుడు ఖాసీం ఖాన్ స్పందించారు. తన తండ్రి సజీవంగా ఉన్నట్లు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. "మా నాన్న 845 రోజులుగా జైల్లో ఉన్నారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. మా నాన్నను చూసేందుకు నన్ను, మా కుటుంబసభ్యులను అనుమతించడం లేదు. ఫోన్‌లో మాట్లాడించట్లేదు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై మాకు ఎలాంటి సమాచారం అందట్లేదు. ఇలా ఆయన్ను చీకట్లోనే మగ్గిపోయేలా చేయడం సరికాదు. మా నాన్న ఆరోగ్యం గురించి మాకు తెలియకుండా ఉండాలని ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నట్లు అనిపిస్తోంది. ఇలాంటి అమానవీయ నిర్బంధం వల్ల మా నాన్నకు ఏం జరిగినా దానికి పాక్ ప్రభుత్వం, అంతర్జాతీయ సమాజం బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని ఖాసీం ఖాన్ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఇమ్రాన్ ఖాన్ విషయంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు జోక్యం చేసుకోవాలని కోరారు. తన తండ్రి సజీవంగా ఉన్నట్లు ప్రభుత్వం ఆధారాలు చూపించాలని కోరారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇమ్రాన్‌ను జైలుకు పంపించాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ విదేశాంగ శాఖ తమ 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ ప్రచారం నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అందుకు అనుమతించలేదు. అంతేకాదు.. తమపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఇమ్రాన్ సోదరీమణులు వాపోయారు. దీంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. దీనిపై స్పందించిన జైలు అధికారులు ఆయన క్షేమంగానే ఉన్నారంటూ ప్రకటన విడుదల చేసింది.

## థర్డ్ వరల్డ్ దేశాల నుంచి

# శాశ్వతంగా వలసల నిలిపివేత

- దేశ ప్రశాంతతకు భంగం కలిగించే వారిని బహిష్కరిస్తాం
- బాంబు పేల్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలిపేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "మనం (అమెరికా) సాంకేతికంగా ముందుకెళ్తున్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నా. జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసిన లక్షల మంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నాం. అమెరికాకు ఆస్తి కాని లేదా మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం (అమెరికా కాలమానం ప్రకారం) కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన ఓ సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మానుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌ను అధికారులు సమీక్షించనున్నారు. పేద, అభివృద్ధి అంతగా లేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తక్కువ ఆదాయం కలిగిన దేశాలుగా పేర్కొంటున్నారు. దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఫ్గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండా వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

## త్వరలో వెనెజువెలా భూభాగంపై ఆపరేషన్లు: ట్రంప్

**వెనెజువెలా :** వెనెజువెలాకు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతిత్వరలో వెనెజువెలా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని.. దీంతో వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనెజువెలాను మరోసారి హెచ్చరించారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడుల్లో 80మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో.. ఏ క్షణమైనా అగ్రరాజ్యం వెనెజువెలా భూభాగంపై దాడి చేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనెజువెలాలో అమెరికా దళాలు చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. వెనెజువెలా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ ఇటీవల స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు వెనెజువెలాలోని చమురు రిజర్వులను స్వాధీనం చేసుకోవడానికే చర్యలు చేపడుతోందని వార్తలు ప్రచారం అవుతున్నాయి.

## హాంకాంగ్ అగ్నిప్రమాద ఘటన

### 128కి పెరిగిన మృతులు



**హాంకాంగ్:** హాంకాంగ్‌లోని ఏడు బహుళ అంతస్తుల భవనాల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 128 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఇంకా 200 మందికి పైగా ఆచూకీ దొరకడం లేదు. ఈ భవంతుల్లో చెలరేగిన అగ్నికీలలను అధికారులు కొన్ని గంటల పాటు శ్రమించి ఆర్పివేశారు. చివరి ప్రయత్నంగా.. అగ్నిమాపక సిబ్బంది ఒక్కో అపార్ట్‌మెంట్‌లో వరుసగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక భవన సముదాయంలో చెలరేగిన మంటలు క్షణాల్లో పక్కనే ఉన్న మిగతా టవర్లకు వ్యాపించాయి. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు 1000 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది 24 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇప్పటికీ కొన్ని భవనాల నుంచి పొగ వెలువడుతూనే ఉంది. ఈ భవంతుల మరమ్మతుల సందర్భంగా కిటికీల వద్ద ఏర్పాటుచేసిన పాలిస్టరైన్ బోర్డుల వల్లే మంటల తీవ్రత పెరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు మరమ్మతు పనుల కోసం ఏర్పాటు చేసిన వెదురు బొంగులు, నిర్మాణ మెష్ కూడా మంటల వ్యాప్తికి కారణమై ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన హౌసింగ్ కాంప్లెక్స్‌ను తై పో జిల్లాలో 1983లో నిర్మించారు. ఇందులో ఒక్కోటి 31 అంతస్తులతో మొత్తం 8 టవర్లు ఉన్నాయి. ఇవన్నీ చాలా దగ్గర దగ్గరగా ఉన్నాయి. మొత్తం 1,984 ఫ్లాట్లు ఉండగా.. ఇందులో దాదాపు 4,600 మంది నివసిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో 40 శాతానికి పైగా 65 ఏళ్ల పైబడినే వారేనని తెలుస్తోంది.

## దిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం

- అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్
- సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తించే యత్నం



**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం గా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్ ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపం లోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్న ట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికా రులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నా మని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నా యన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లను న్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయా లను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికా రులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

## సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

- జనవరి 1న ఆయుధాలు వదిలి వస్తాం
- ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ

**రాయపూర్, నవంబర్ 28 :** మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర- మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతావారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. జనజీవన స్రవంతిలో కలిసేందుకు తమకు కొంత సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాసిన సంగతి తెలిసిందే.



## డిసెంబరు 4-5 తేదీల్లో పుతిన్ భారత పర్యటన

**న్యూఢిల్లీ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. డిసెంబరు 4-5 తేదీల్లో ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలుచేస్తోన్న వేళ పుతిన్ రాక ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన మన దేశంలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మోదీ-పుతిన్ ద్వైపాక్షికంగా భేటీ కానున్నారు. ఆయన గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేక విందు ఇవ్వనున్నారు. పుతిన్ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థకు భవన నిర్మాణం, జౌళి, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఈ క్రమంలో 70వేల మందికి పైగా భారతీయ కార్మికులు, నిపుణులకు రష్యాలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఈ మేరకు రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2021 తర్వాత పుతిన్ భారత్‌కు రావడం మళ్లీ ఇప్పుడే. గతేడాది ప్రధాని మోదీ, పుతిన్ రెండుసార్లు భేటీ అయ్యారు. 2024 జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ప్రధాని మోదీ రష్యాకు వెళ్లారు. ఆ సందర్భంలో మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో బ్రిక్స్ సదస్సు సందర్భంగా రష్యాలోని కజాన్‌లో వీరిద్దరూ మరోసారి సమావేశమయ్యారు. ఇక, ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో పుతిన్-మోదీ భేటీ అయి పలు అంశాలపై చర్చించిన సంగతి తెలిసిందే.

## వేగంగా కదులుతున్న దిత్వా తుఫాన్

### తమిళనాడులో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

**చెన్నై, నవంబర్ 28 :** ప్రస్తుతం శ్రీలంక తీరప్రాంతం, దాన్ని ఆనుకని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'దిత్వా తుఫాను' వేగంగా కదులుతోంది. ఈ వారాంతంలో ఉత్తర తమిళనాడువైపుకి కదులుతోందని, దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రామనాథపురం, తంజావూరు సహా ఐదు దక్షిన తీరప్రాంత, డెల్టా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తుఫాను మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఆర్ఎంసి శుక్రవారం డెల్టా, దాని పరిసర జిల్లాలైన అరియలూర్, కడలూర్‌లకు ఆరెంజ్ అలర్ట్, ఎల్లో అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది.దిత్వా తుఫాను తమిళనాడు మరియు ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరగా కదులుతుందని , నవంబర్ 29,30 మరియు డిసెంబర్ 1 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. తమిళనాడు విపత్తు ప్రతిస్పందన దళం (టిడిఆర్ఎఫ్) చెందిన 30మంది సిబ్బంది శుక్రవారం తంజావూరుకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మరో 30మంది టిఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది తిరువారూర్ చేరుకున్నారని అన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని తంజావూరు కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు కూడా ఒడ్డుకు తిరిగి వచ్చారని తెలిపారు.

# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీనికితోడు అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత, దేశ క్యూ2 జీడీపీ గణాంకాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. నిఫ్టీ మాత్రం 26,200 ఎగువనే ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 85,791.55 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ.. చివరికి 13.71 పాయింట్ల నష్టంతో 85,706.67 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 12.60 పాయింట్ల నష్టంతో 26,202.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటెర్నల్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌ధర 62 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4176 డాలర్ల వద్ద కొనసాగుతోంది.









## ‘బంగారం ధరలు నిర్ణయించే స్థాయికి భారత్’


**దిల్లీ:** ప్రపంచంలో అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ఒకటి. పెద్ద మొత్తంలో బంగారం మన దేశంలో ఉన్నా.. దీని ధర నిర్ణయించే అధికారం మాత్రం లేదు. భవిష్యత్తులో మాత్రం ప్రపంచ గోల్డ్ మార్కెట్‌లో ధరలు నిర్ణయించే దేశంగా భారత్ ఎదగనుందని, ఇందుకు సొంత గనుల నుంచి వచ్చే బంగారం కీలక భూమిక పోషిస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే దశాబ్ద కాలంలో దేశ బంగారు అవసరాలను సుమారు 20 శాతం సొంత గనులే తీర్చనున్నాయని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జెమ్స్ అండ్ జ్యువెలరీ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో గోల్డ్ మైనింగ్ కీలక భూమిక పోషించబోతోందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా రీజనల్ సీఈఓ సచిన్ జైన్ అన్నారు. దేశీయంగా గనుల తవ్వకం వల్ల ఇండియన్ గోల్డ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు, ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కూడా వస్తాయని చెప్పారు. దేశంలో గణనీయమైన బంగారు గనులు లేకపోవడం, గోల్డ్ బ్యాంకింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రైస్ టేకర్‌గా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం లండన్ ఏఎం, పీఎం బెంచ్‌మార్క్ ధరలను అనుసరిస్తున్నామని చెప్పారు. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పులతో రానున్న రోజుల్లో మనమే ధరలు నిర్ణయించే స్థాయికి చేరుకుంటామని సచిన్ జైన్ ధీమా వ్యక్తంచేశారు. వచ్చే రెండు మూడేళ్లలో భారత్ ప్రపంచ జ్యువెలరీ హబ్‌గా ఎదగనుందని అభిప్రాయపడ్డారు. భారతీయుల దగ్గర సుమారు 25 వేల టన్నుల బంగారం ఉందని ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన నోవల్ జువెల్స్ సీఈఓ సందీప్ కోహ్లీ అన్నారు. ప్రభుత్వం వద్ద 800 టన్నుల బంగారం ఉందన్నారు. అదే స్విట్జర్లాండ్ ప్రభుత్వం వద్ద వెయ్యి టన్నులుంటే.. ప్రజల వద్ద 200 టన్నులు మాత్రమే ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుగా ఉన్న భారత్.. బంగారం ధరలను నిర్ణయించే స్థితిలో లేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని కోహ్లీ అన్నారు. అయితే ఖరీదైన కారు, స్మార్ట్‌ఫోన్ కొనుగోలు విషయంలో లేని ఆందోళన.. బంగారం విషయంలో మాత్రం ఉంటోందన్నారు. ఆన్‌లైన్‌లో పోల్చుకునే సౌలభ్యం లేకపోవడమే కారణమని చెప్పారు. బంగారం ధరలు నిర్ణయించడంలో ప్రపంచ స్థాయికి ఎదగాలంటే సోర్సింగ్, మార్కెటింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత అవసరమని ఎంఎంటీసీ పీఏఎంపీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సమిత్ గుహ అన్నారు. బీఐఎస్ అందిస్తున్న హాల్‌మార్కింగ్‌ను కొనియాడుతూనే మరింత మెరుగైన విధానాలు అవసరమని అభిప్రాయపడ్డారు. 2012–13 ఆర్‌బీఐ విధించిన నిబంధన వల్ల 24 క్యారెట్ బులియన్ ఎగుమతిపై నిషేధం ఎదుర్కొంటున్నామని చెప్పారు. గ్లోబల్ ఎక్స్ఛేంజీలో భారతీయ బులియన్ సరఫరా చేయాలంటే ఈ నిబంధనపై ఒకసారి పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



## అండర్-19 ఆసియా కప్..
### భారత జట్టులో వైభవ్ సూర్యవంశీకి స్థానం

డిసెంబర్ 12 నుంచి 21 వరకు దుబాయ్ వేదికగా అండర్–19 ఆసియా కప్ జరగనుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత అండర్–19 జట్టును ప్రకటించింది. ఆయుష్ మాత్రే టీమ్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ సంచలనం, ఇటీవల రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో అద్భుత సెంచరీ చేసిన వైభవ్ సూర్యవంశీ తిరిగి జట్టుకు ఎంపికయ్యాడు. విహాన్ మనోజ్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ టోర్నమెంట్ అండర్–19 వరల్డ్‌కప్‌నకు సన్నాహకంగా ఆయా జట్లు భావిస్తున్నాయి. ఈ మెగా టోర్నీ వచ్చే సంవత్సరం జనవరి– ఫిబ్రవరి మధ్య జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనుంది.

**అండర్ –19 ఆసియా కప్‌నకు భారత జట్టు:** ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), యువరాజ్ గోహిల్, కాన్షిక్ చౌహాన్, ఖిలాన్ ఎ.పటేల్, నమన్ పుష్పక్, డి.దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, అరోన్ జార్జ్



## అతి త్వరలోనే స్మృతి, పలాశ్ వివాహం
### : తల్లి అమిత ముచ్చల్

భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం నిరవధిక వాయిదా పడిన విషయం తెలిసిందే. నిజానికి వీరి వివాహం నవంబర్ 23న జరగాల్సిఉంది. కానీ.. అదే రోజు పెళ్లికి కొన్ని గంటల ముందు స్మృతి నాన్న శ్రీనివాస్ గుండెపోటు లక్షణాలతో బాధ పడ్డారు. దీంతో ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చారు. ఇలాంటి పరిస్థితుల్లో తాను వివాహం చేసుకోలేనని అందుకే నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఆమె నిర్ణయం తీసుకున్నారని మంధాన మేనేజర్ తెలిపారు. కాసేపటికే.. స్మృతి మంధానాకు కాబోయే భర్త పలాశ్ ముచ్చల్ సైతం అనారోగ్యానికి గురై సాంగ్లీలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. అనంతరం డిశ్చార్జ్ కూడా అయ్యాడు. కానీ తిరిగి అనారోగ్య సమస్యలు తిరగబెట్టడంతో ఈసారి ముంబయిలోని ఆసుపత్రిలో చేరాడు. ఒత్తిడి, యాంగ్జైటీ వల్ల పలాశ్ అనారోగ్యానికి గురయ్యాడని వైద్యులు తెలిపారు. అతడికి ఆక్సిజన్ థెరపీని అందించారు. మూడు వారాలు విశ్రాంతిని సూచించారు. మరోవైపు స్మృతి మంధాన తండ్రి సైతం కొన్ని రోజుల చికిత్స తర్వాత ఇంటికి చేరుకున్నారు. అయితే వీరి వివాహానికి సంబంధించిన అప్‌డేట్ మాత్రం స్మృతి మంధాన వైపు నుంచి రాలేదు. తాజాగా పలాశ్ తల్లి అమిత, ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని వివరించారు. ‘స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ ఇద్దరూ ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారు. పలాశ్.. స్మృతిని అర్ధాంగిగా ఇంటికి తీసుకురావాలని కలలు కన్నాడు. నేను కూడా వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. ఇప్పుడంతా బాగానే ఉంది. వారిద్దరి వివాహం అతిత్వరలో జరుగుతుంది’ అని ఆమె అన్నారు. అయితే స్మృతి మంధాన తన వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా ఖాతా నుంచి తొలగించడం పలు ఊహాగానాలకు కారణమైంది. అదే సమయంలో పలాశ్ ముచ్చల్ మరో మహిళతో మంధానను కించపరుస్తూ చాట్ చేసినట్లు ఆరోపిస్తున్న స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో పలు వదంతులు వ్యాపించాయి. స్మృతి తండ్రి శ్రీనివాస్‌కు అనారోగ్యం వల్ల వివాహం నిరవధికంగా వాయిదా పడిందని ఇరు కుటుంబాల వారు అధికారికంగా ప్రకటించారు. అయితే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న రూమర్లపై మాత్రం ఇంతవరకూ వారు స్పందించలేదు.

# రాంచీలో నెట్స్‌లో రో-కో ప్రాక్టీస్



రాంచీ వేదికగా ఆదివారం (నవంబర్ 30) టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డే మ్యాచ్ జరగనుంది. ఈనేపథ్యం లో భారత జట్టు ఇప్పటికే రాంచీకి చేరుకుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తూ కనిపించారు. ఇప్పటికే టీ20లు, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రో–కో ద్వయం ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నారు. వీరు 2027 వన్డే వరల్డ్‌కప్ లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. కోల్‌కతా టెస్ట్‌లో 30 పరుగుల తేడాతో ఓడిన టీమ్ఇండియా, గువాహటి టెస్ట్‌లో ఏకంగా 408 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రన్స్ పరంగా భారత జట్టుకు ఇదే అతిపెద్ద ఓటమి. అలాగే 25 సంవత్స రాల అనంతరం టీమ్ఇండియా దక్షిణాఫ్రికా చేతిలో స్వదేశం లో టెస్ట్ సిరీస్ ఓడిపోయింది. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ, విరాట్‌కోహ్లీలు రాణించి వన్డే సిరీస్‌ను కైవసం చేసుకొని, బదులు తీర్చుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఆసీస్ టూర్‌లో రోహిత్ శర్మ సెంచరీతో సత్తా చాటాడు. విరాట్ కోహ్లీ మొదటి రెండు మ్యాచుల్లో వరుసగా రెండుసార్లు డకౌట్‌గా వెనుదిరిగినప్పటికీ, మూడో మ్యాచ్‌లో హాఫ్‌సెంచరీతో ఫామ్ అందుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్‌లో శుభ్‌మన్ గిల్ గాయపడి జట్టుకు దూరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడి గైర్హాజరీలో కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రిషభ్ పంత్ సైతం వన్డే జట్టులో చోటు సంపాదించుకున్నాడు.

**సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు భారత జట్టు:** రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్ (కెప్టెన్, వికెట్‌కీపర్), రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, నితీశ్‌కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.

## భారత, శ్రీలంక మహిళల జట్ల మధ్య టీ20 సిరీస్



భారత మహిళల జట్టు ఇటీవలే వన్డే వరల్డ్ కప్ నెగ్గి విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీ అనంతరం టీమ్ఇండియా తొలిసారిగా శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. నిజానికి టీమ్ఇండియా బంగ్లాదేశ్‌తో డిసెంబర్‌లో మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ.. రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్త పరిస్థితులున్న నేపథ్యంలో అది వాయిదా పడింది. దీంతో భారత జట్టు శ్రీలంకతో అయిదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు బీసీసీఐ ఈ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్ డిసెంబర్ 21న విశాఖపట్నంలో, చివరి మ్యాచ్ డిసెంబర్ 30న తిరువనంతపురంలో జరగనుంది. ఇది టీ20 వరల్డ్ కప్ 2026కు మొదటి సన్నాహకంగా నిలవనుంది. 2024లో జరిగిన మునుపటి టోర్నమెంట్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన తర్వాత భారత జట్టు తొలి దశలోనే నిష్క్రమించింది. అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు వెస్టిండీస్, ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లను కైవసం చేసుకుంది. టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు భారతజట్టు ఆస్ట్రేలియా (ఫిబ్రవరి 2026), ఇంగ్లాండ్‌తో (మే 2026) తలపడనుంది. స్వదేశంలో వన్డే ప్రపంచ కప్ విజయం తర్వాత టీమ్ఇండియా మీద ప్రస్తుతం అంచనాలు పెరిగాయి.

**టీమ్ఇండియా -శ్రీలంక టీ20 సిరీస్ షెడ్యూల్**

- ఆదివారం– 21 డిసెంబర్–మొదటి టీ20–విశాఖపట్నం
- మంగళవారం–23 డిసెంబర్–రెండో టీ20–విశాఖపట్నం
- శుక్రవారం–26 డిసెంబర్–మూడో టీ20–తిరువనంతపురం
- ఆదివారం–28 డిసెంబర్–నాలుగో టీ20–తిరువనంతపురం
- మంగళవారం–30 డిసెంబర్–అయిదో టీ20–తిరువనంతపురం

## మొన్న ఆర్సీబీ.. ఇప్పుడు రాజస్థాన్
# అమ్మకానికి ఐపీఎల్ జట్లు



వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్‌లో పలు ఫ్రాంఛైజీలు కొత్తగా కన్పించే అవకాశముంది. ఇప్పటికే ఈ ఏడాది ఐపీఎల్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును అమ్మకానికి పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా రాజస్థాన్ రాయల్స్ జట్టు కూడా చేతులు మారనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ పారిశ్రామి కవేత్త హర్ష్ గొయెంకా చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. “ఒకటి కాదు.. రెండు ఐపీఎల్ జట్లు అమ్మకానికి ఉన్నట్లు తెలిసింది. అవే ఆర్సీబీ, ఆర్.ఆర్. వీటిని దక్కించుకునేందుకు నలుగురు, ఐదుగురు కొనుగోలుదారులు రేసులో ఉన్నారు. వారిలో ఈ ఫ్రాంఛైజీలు ఎవరికి దక్కనున్నాయో..! పుణె, అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు, యూఎస్ఏ.. కొత్త యజమానులు ఎక్కడినుంచి వస్తారో..?” అని హర్ష్ గొయెంకా తన ‘ఎక్స్’ ఖాతాలో రాసుకొచ్చారు. దీంతో ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయ ల్స్.. రాయల్స్ స్పోర్ట్స్ గ్రూప్ చేతుల్లో ఉంది. ఈ కంపెనీకి ఫ్రాంఛైజీలో 65శాతం వాటా ఉంది. ఇటీవల ఆర్సీబీ యజ మాని అయిన డియాజియో కంపెనీ ఈ ఫ్రాంఛైజీ విక్ర య ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం ఇచ్చింది. ఆర్సీబీ ఫ్రాంచై జీలో పెట్టుబడి పెట్టే వారి కోసం చూస్తున్నట్లు, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తికానున్నట్లు ఆ సంస్థ తె లిపింది. ఆర్సీబీ విక్రయం గురించి తొలుత ప్రముఖ పారిశ్రా మికవేత్త అదర్ పూనావాలా ఈ ఏడాది అక్టోబరులో హింట్ ఇచ్చారు. పూనావాలాతో పాటు మరో రెండు ప్రముఖ సంస్థలు కలిసి ఆర్సీబీని కొనుగోలు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.



## ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి జీడీపీ..

**దిల్లీ:** భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో మెరుగైన జీడీపీ గణాంకాలను నమోదు చేసింది. జులై– సెప్టెంబర్ త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదైంది. ఆరు త్రైమాసికాల గరిష్ఠానికి చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 5.6 శాతంగా నమోదు కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. ప్రైవేటు మూలధన వ్యయం అంతంతమాత్రంగానే ఉన్నా.. గ్రామీణ స్థాయిలో వినియోగం పెరగడం, ప్రభుత్వ వ్యయంలో పెరుగుదల జీడీపీ వృద్ధిలో కీలక భూమిక పోషించాయి. పండగ సీజన్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ హేతుబద్ధీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 22న తగ్గించిన జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయి. దీనికితోడు పండగ సీజన్ కొనుగోళ్లు కలిసొచ్చి దేశీయంగా వినియోగం పెరిగి వృద్ధికి ఊతం లభిస్తుందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. కానీ, జీఎస్టీ రేట్ల ప్రభావం పూర్తిగా కనిపించకముందే.. మెరుగైన జీడీపీ గణాంకాలు నమోదుకావడం గమనార్హం. ముఖ్యంగా జీడీపీలో 14 శాతం వాటా కలిగిన తయారీ రంగం 9.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతేడాది ఈ వృద్ధి 2.2 శాతంగా ఉంది.

### నైపుణ్యం లేనివారు కూడా యాప్ తయారుచేసేలా
## టెక్నాలజీ మారిపోయింది
### ‘వైబ్ కోడింగ్’పై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్



ఇటీవల కృత్రిమ మేధ శరవేగంగా విస్తరిస్తోంది. పరిశ్రమలు, విద్య, వ్యాపార రంగాలతో పాటు రోజువారీ వ్యవహారాలనూ పూర్తిగా మార్చేస్తోంది. ఈ నేపథ్యంలో అధునాతన ప్రోగ్రామింగ్ విధానం ‘వైబ్ కోడింగ్’పై గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గూగుల్ ఫర్ డెవలపర్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. కృత్రిమ మేధతో ప్రపంచవ్యాప్తంగా నిశ్శబ్ద మార్పు కనిపిస్తోందన్నారు. ఇంజినీరింగ్ నేపథ్యాల నుంచి రాని వ్యక్తులు కూడా వారు కోరుకునే విషయాల ఆధారంగా ‘వైబ్ కోడింగ్’ సహాయంతో యాప్‌లను రూపొందిస్తున్నారని.. దీనితో యాప్ డెవలప్‌మెంట్ మరింత తేలికయ్యిం దన్నారు. ఇంజినీరింగ్ నేపథ్యాల నుంచి రాని వ్యక్తులు, కృత్రిమ మేధలో ఎటువంటి నైపుణ్యం లేనివారు కూడా ఏఐ–సహాయక సాధనాలను ఉపయోగించి నిమిషాల్లో యాప్ తయారుచేసేలా టెక్నాలజీ మారిపోయిందని పిచాయ్ అన్నారు. ఇంటర్నెట్ కొత్తగా పరిచయమైన సమయంలో రచయితలు ఎలా అయితే బ్లాగింగ్‌ను తమ కెరీర్‌గా మార్చుకోగలిగారో అదేవిధంగా ఇప్పుడు వైబ్ కోడింగ్ కూడా ఉద్యోగాలలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. అయితే ఇది ఎంత సరదాగా ఉంటుందో అన్ని సమస్యలు కూడా తీసుకువచ్చే అవకాశముందన్నారు. వైబ్ కోడింగ్ ఇంకా సంక్లిష్టమైన లేదా అత్యంత సున్నితమైన సాఫ్ట్‌వేర్‌కు సిద్ధంగా లేదని తెలిపారు. దీనివల్ల మన సమాచారానికి, డేటాకు భద్రత ఉంటుందని హామీ ఇవ్వలేమన్నారు. ఇటువంటి టెక్నాలజీలు ముందు ముందు మరింత పరివర్తన చెందొచ్చని.. వాటిని ఉపయోగించి ప్రజలు చివరికి ఏం చేస్తారోనని తాను ఎదురుచూస్తున్నానని పిచాయ్ అన్నారు.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక



# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్



దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన రుద్ర గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.

# 'లాక్ డౌన్'పై ఎక్స్‌పెక్టేషన్స్

సర్వైవల్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందిన చిత్రం 'లాక్ డౌన్'. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా మూవీ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. 'ప్రతి క్షణం మీ బలాన్ని పరీక్షించే ప్రపంచం.. లాక్ డౌన్ ట్రైలర్ 27-11న ఉదయం 11 గంటలకు విడుదల అవుతుంది' అంటూ అనుపమ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ట్రైలర్‌పై అంచనాలు పెంచుతోంది. కాగా.. ఈ చిత్రం దర్శకుడు ఏ.ఆర్. జీవా ఫీచర్ డైరెక్టోరియల్ డెబ్యూట్. లైకా ప్రొడక్షన్స్ సుబాస్కరన్ బ్యాకింగ్‌లో రూపొందిన ఈ మూవీలో అనుపమాతో పాటు చార్లీ, నిర్మల, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇది ఎమోషన్స్‌తో కూడిన, సస్పెన్స్ సినిమా అని అర్థమవుతుండగా.. ఇప్పటికే 'లాక్ డౌన్'పై ప్రేక్షకుల్లో ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి.

# భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్




బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,ధురంధర్అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను ఉరి దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బిటౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్ఆర్ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.

# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం స్పిరిట్ షూటింగ్ మొదలైంది.స్పిరిట్ కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా స్పిరిట్ సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే స్పిరిట్ చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రీటా.. రివాల్వర్ మిస్‌ఫైర్!

**ఓ వైపు కథానాయికగా కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ జోరు చూపించే ప్రయత్నం చేస్తోంది కీర్తి సురేశ్. ఇప్పుడామె నుంచి వచ్చిన యాక్షన్ సినిమా 'రివాల్వర్ రీటా'.**

రివ్యూ



పాండిచ్చేరిని అడ్డాగా చేసుకుని ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టిస్తాడు డాన్ డ్రాకులా పాండ్యన్ (సూపర్ సుబ్బరాయన్). అతన్ని ఎలాగైనా హత్య చేసి తన సోదరుడి చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని నర్సింహారెడ్డి (అజయ్ ఘోష్) ఓ ముఠాతో రూ. 5 కోట్లకి ఒప్పందం కుదుర్చుకుంటాడు. దీనిలో భాగంగా పాండ్యన్‌ను హనీట్రాప్ చేసి చంపేందుకు ప్రణాళిక రచించగా.. అతను డ్రగ్స్ మత్తులో ఓ ఇంటికి వెళ్లబోయి పొరపాటున పక్క వీధిలో ఉన్న రీటా (కీర్తి సురేశ్) ఇంటికి వెళ్తాడు. అక్కడ అనుకోకుండా జరిగిన గొడవలో రీటా తల్లి (రాధికా శరత్ కుమార్) కొట్టిన దెబ్బకు పాండ్యన్ అక్కడిక్కడే ప్రాణాలు విడుస్తాడు. మరి ఆ తర్వాత ఏమైంది? డ్రాకులా పాండ్యన్ హత్య వల్ల రీటా కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? పాండ్యన్‌ను హత్య చేసి రూ. 5కోట్లు కొట్టేయాలనుకున్న మార్టిన్ ముఠా వల్ల రీటాకి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? తన తండ్రి జాడ వెతుక్కుంటూ వేట మొదలు పెట్టిన బాబీ పాండ్యన్ (సునీల్)కి రీటా కుటుంబం చేసిన పని గురించి తెలిసిందా? లేదా? అన్నది చిత్ర కథ.

## ఎలా ఉందంటే...

ఇది పగ, ప్రతీకారాలతో ముడిపడి ఉన్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్. కర్మ ఎవరినీ విడిచి పెట్టదు.. దాని ఫలితాన్ని అనుభవించక తప్పదనే కోణంలో సాగుతుంది. కథానాయిక కుటుంబంలో జరిగిన ఓ అన్యాయానికి కాలం కర్మ రూపంలో ఎలా బదులు తీర్చుకునే అవకాశమిచ్చిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. లైన్‌గా చూసినప్పుడు ఈ కథ ఆసక్తిరేకెత్తించేలాగే ఉన్నా.. దాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం ఏమాత్రం మెప్పించదు. ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌లో ఇటు నవ్వులు.. అటు థ్రిల్ ఏదీ సరిగ్గా పండలేదు. కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సినిమాను మొదలు పెట్టిన దర్శకుడు.. డ్రాకులా పాండ్యన్ ప్రాణాలు కోల్పోవడంతో కీలక మలుపు తిప్పాడు. ఇక అక్కడి నుంచి ఇంట్లో శవాన్ని మాయం చేసేందుకు ఇటు రీటా కుటుంబం పడే పాట్లు.. అటు ఆ శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలతో కథ ముందుకు సాగుతుంది. ఈ మధ్యలో తండ్రి జాడ కనిపెట్టేందుకు బాబీ పాండ్యన్ కూడా రంగంలోకి దిగడంతో కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. కానీ, ప్రతి ఎపిసోడ్ ఊహలకందేలాగే సాగుతుంటుంది. రీటా కారులోని శవాన్ని దక్కించుకునేందుకు మార్టిన్ గ్యాంగ్ చేసే ప్రయత్నాలు ఏమాత్రం థ్రిల్ పంచవు. ఈ ముగ్గురి మధ్య నడిచే దోబూచులాట ద్వితీయార్ధం నుంచి కొత్త మలుపు తీసుకుంటుంది. ప్రీక్లైమాక్స్ నుంచి కథ థ్రిల్లింగ్‌గా మారుతుంది. మార్టిన్ గ్యాంగ్.. బాబీ పాండ్యన్.. నర్సింహారెడ్డి పాత్రలన్నీ ఓ చోటుకు చేరడం, రీటా తన తెలివితేటలతో వారిని మట్టుబెట్టే తీరు థ్రిల్ పంచుతుంది. టైటిల్‌కు న్యాయం చేకూర్చేలా పతాక ఘట్టంలో కథానాయికతో రివాల్వర్ పట్టించారు.

## ఎవరెలా చేశారంటే..

రీటా పాత్రలో కీర్తి సురేశ్ తెరపై అందంగా కనిపించింది. నటిగా ఇది ఆమెకు సవాల్ విసిరే పాత్రేమీ కాదు. సినిమా మొత్తం దాదాపు ఒకే ఎక్స్‌ప్రెషన్‌లో కనిపిస్తుంది. ద్వితీయార్ధంలో తనలోని యాక్షన్ కోణాన్ని రుచి చూపించింది. తల్లి పాత్రలో రాధికా శరత్ కుమార్ నటన అక్కడక్కడా నవ్వులు పూయించింది. ప్రతినాయకుడిగా బాబీ పాండ్యన్ పాత్రలో సునీల్ ఆద్యంతం సీరియస్ లుక్‌లోనే కనిపించారు. తన ఆహార్యం కొత్తగా ఉంది. జాన్ విజయ్, సూపర్ సుబ్బరాయన్, అజయ్ ఘోష్ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి. రెడిన్ కింగ్‌స్లే తెరపై కనిపించినప్పుడల్లా నవ్వించే ప్రయత్నం చేశారు. దర్శకుడు రాసుకున్న కథలో కొత్తదనం లేదు. పతాక సన్నివేశాలు మాత్రం అలరిస్తాయి.



# మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి : నవీన్

టాలీవుడ్‌లో తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయతో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన జాతిరత్నాలుతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా అనగనగా ఒక రాజుని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ అనగనగా ఒక రాజు ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉ ందన్నాడు. ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు అనగనగా ఒక రాజుపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రమాదాన్ని జయించి, ప్రేక్షకుల ముందుకు వస్తున్న నవీన్ ప్రయాణం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com